ప్రజాశక్తి

గురువారం 9 నవంబర్ 2023   8 పేజీలు

ప్రకాశం   బాపట్ల

ప్రజాసమస్యలు పట్టని ముఖ్యమంత్రి

- రాష్ట్రంలో కరువు తాండవిస్తున్నా పట్టించుకోవట్లేదు..
- పరదాల మాటున బటన్ నొక్కే సిఎంగా పేరుగాంచిన జగన్
- ప్రజారక్షణభేరి బస్సుయాత్రలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

పర్చూరులో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి-బాపట్ల

'రాష్ట్రంలో కరువు తాండవిస్తోంది. వ్యవసాయ కార్మికుల వలసలు పెరిగాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం బటన్ నొక్కుడు కార్యక్రమమే పనిగా పెట్టుకుని ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదు' అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ తెలిపారు. ప్రజారక్షణ భేరిలో భాగంగా బుధవారం బాపట్ల చేరుకున్న బస్సు యాత్రను ఉద్దేశించి బాపట్ల పాత బస్టాండ్ సెంటర్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే ముఖ్యమంత్రి బటన్ నొక్కుడు ▶ 2లో

బాపట్లలో బస్సుయాత్రలో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

తేల్చుకుందాం..

- బాలినేని, దామచర్ల మధ్య మాటల యుద్ధం
- తాజాగా బకింగ్‌హాం బ్రిడ్జి రోడ్డు కోతపై వాగ్వాదం

8లో ▲

ఎస్‌టి కాలనీలో చేరిన వరదనీరు

జల దిగ్బంధనంలో ఎస్టీ కాలనీ

నాగులుప్పలపాడు నుంచి ఇంకొల్లు వెళ్లే రోడ్డులోని ఎస్‌టి కాలనీలో వరద నీరు చేరింది. ఆ కాలనీలోని 30 కుటుంబాల వారు జల దిగ్భంధనంలో చిక్కుకున్నారు. తహశీల్దారు సుజన్‌కుమార్ కాలనీ వాసులను బుధవారం నాగులుప్పలపాడులోని హైస్కూల్‌కు తరలించారు. 2లో ▲

విద్యాసంస్థల బంద్ విజయవంతం

▶ మెయిన్ 6లో

ప్రజాసమస్యలు పట్టని ముఖ్యమంత్రి

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమం ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నారని తెలిపారు. ఆ కార్యక్రమానికి వెళ్లినప్పుడు సైతం పరదాల మధ్య బటన్ నొక్కి వెళతాడే తప్ప ప్రజా సంక్షేమం, సమస్యల పట్ల ఏమాత్రం శ్రద్ధ లేదన్నారు. సాగునీటి కోసం రైతులు అల్లాడుతుంటే సహజ వనరులను వినియోగించుకోవడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఉదాహరణకు గుండ్లకమ్మ వాగు గేట్లు సరిచేసి అందులో నీటిని వినియోగించుకుంటే రైతులకు సాగునీరు, అనేక గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్య తీరుతుందన్నారు. విచిత్రమైన ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి తమ పేరును సార్ధకత చేసుకొని, ప్రజలకు నేరుగా కనపడని ముఖ్యమంత్రిగా పేరుగాంచారన్నారు. అదేమంటే మోడీ గారి దయ అంటాడని, రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే పట్టించుకోని ముఖ్యమంత్రి నియంత పాలన కొనసాగిస్తున్నాడని విమర్శించారు. రాష్ట్ర విభజనకు ఇచ్చిన హామీలు నెరవేర్చని మోడీతో ఆ విషయాలు మాట్లాడిన దాఖలాలే లేవన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా విజయవాడలో ఈ నెల 15న జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు నిర్మాణదశలో ఉన్న బాపట్ల మెడికల్ కళాశాలను సందర్శించారు. మెడికల్ కళాశాల పనులను పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ, ఆటో వర్కర్ల సమస్యలపై ఆయా సంఘాల నాయకులు పార్టీ రాష్ట్ర నాయకులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, కె.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు, దయా రమాదేవి, జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, జిల్లా నాయకులు మజుందార్, పార్టీ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, వై.భాస్కరరావు, నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి, బుచ్చిరాజు శరత్, లక్ష్మణ, నిరంజన్, సుభాషిని పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డిఇఒ శ్రీనివాసులు

జెవివి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చీరాల

ప్రజలలో మూఢనమ్మకాలను పారద్రోలి శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని పర్చూరు డిప్యూటీ డిఇఒ ఆర్.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎన్ ఆర్ అండ్ పిఎం హైస్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ దక్పథంపై నిర్వహిస్తున్న దేశవ్యాప్త ప్రచార పోస్టర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల్లో మూఢనమ్మకాలను పారద్రోలి శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు మాట్లాడుతూ జెవివి చీరాల డివిజన్ ఆధ్వర్యంలో ప్రజలలో శాస్త్రీయ భావజాలం పెంపొం దించడానికి ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్వర్క్ సభ్య సైన్సు సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి ఫిబ్రవరి 28 వరకూ శాస్త్రీయ దక్పథం పై ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు.. జెవివి మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో సైనుపై అవగాహన పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మూఢ నమ్మకాలను ప్రారదోలి, ప్రజలకు సైన్సు పట్ల ఆసక్తి పెంచడంమే జెవివి లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఎన్‌సిసి అధికారి సురేష్, యుటిఎఫ్ నాయకులు జానీ బాషా, సుబ్బారెడ్డి, పిచ్చియ్య, జగన్నాథచారి, సుబ్బారెడ్డి,బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో భారీ వర్షం

- పొంగిన వాగులు, వంకలు
- రాకపోకలకు అంతరాయం
- నీట మునిగిన ఎస్‌టి కాలనీ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం పడింది. దీంతో వాగులు,వంకలు పొంగి ప్రవహించారు. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఉప్పుగుండూరు సమీపంలోని నాగన్న వాగు, మట్టిగుంటవాగు, ఉప్పుగుండూరు- మాచవరం గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగు, కొంగలివాగు పొంగి ప్రవహించాయి. అదేవిధంగా నాగులుప్పల పాడు- తిమ్మనపాలెం మధ్య ఉన్న హనుమాపురం దండువాగు ,కొత్తకోట వాగు పొంగిప్రవహించాయి. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వర్షం పడినప్పుడల్లా కొత్తకోట, హనమాపురం వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆసమయంలో వారం రోజులపాటు ఆ గ్రామాలకు బయట గ్రామాలతో సంబంధాలు ఉండటం లేదు. ఆ వాగుల వద్ద హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిసారి ప్రతిపాదనలు పంపామని చెబుతున్నారు. ఆచరణలో కనిపించడం లేదు. ఉప్పుగుండూరు పరబీడు, అంబేద్కర్ నగర్ కాలనీల్లో సైడు కాలువలు లేదు. దీంతో వర్షం పడినప్పుడల్లా నీరు బయటకు వెళ్లే పరిస్థితి ఉండటం లేదు. నాగులుప్పలపాడు నుంచి ఇంకొల్లు వెళ్లే రోడ్డులోని ఎస్‌టి కాలనీలో వరద నీరు చేరింది. దీంతో ఆకాలనీలోని 30 కుటుంబాల వారు జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. సమాచారం తెలుసుకున్న తహశీల్దారు సుజన్ కుమార్ కాలనీ వాసులను బుధవారం నాగులుప్పలపాడులోని హైస్కూల్‌కు తరలించి పునరావాసం కల్పించారు బియ్యం, కందిపప్పు తదితర నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. మద్దిపాడు ఎఎంసి చైర్మన్ మారెళ్ళ బంగారుబాబు ఆర్థిక సాయం అందచేసి బాధితులకు బాసటగా నిలిచారు.

ఉప్పుగుండూరులో పొంగిపొర్లుతున్న చప్టా

నాగులుప్పలపాడులో నీట మునిగిన మినుము

పల్లపు ప్రాంతంలో నీట మునిగిన పంటలు

భారీవర్షాలకు పంటలకు కొంతమేర ఊరట కలిగింది. పల్లపు ప్రాంత భూముల్లో నీరు చేరింది. వర్షం పంటలకు జీవం పోసిందని రైతులు చెబుతున్నారు. భూములు పదును అయ్యాయని, రబీ సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఈఏడాది మొదటి నుంచి వాతావరణం అనుకూలించలేదు. ఖరీఫ్ సాగు ఘననీయంగా తగ్గింది. జులైలో పడిన వర్షాలకు మిర్చి, పొగాకు ,మినుము, మాగాణి పంటలు తక్కువ విస్త్రీరణంలో సాగు చేశారు. నీరు ఆ పంటలు ఎండు మోహం పెట్టాయి. ఈ దశలో వర్షం పడటంతో పంటలకు జీవం పోసినట్లు అయ్యింది. రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పల్లపు ప్రాంత భూముల్లో సాగు చేసిన మినుము పైరు కొంతమేర నీట మునిగింది. మిర్చి, పంట జొన్న ,పశుగ్రాసం తదితర పంటలు జీవం పోసుకున్నట్లు రైతులు తెలిపారు. వర్షం కారణంగా వాంగులు, వంకలు పొంగి ప్రవహించారు. దీంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. దీంతో పశువుల దాహర్తికి కొంత మేర ఇబ్బందులు తీరినట్లేనని పోషకులు చెబుతున్నారు.

వర్షంతో జీవం పోసుకున్న మిర్చి పంట

గల్లంతైన వ్యక్తిని కాపాడుతున్న రిస్క్యూ టీం

వాగులో కొట్టుకు పోయిన కారు

అధ్యాపకుడిని కాపాడిన పోలీసులు

భారీవర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. నిడమానూరు-హనుమాపురం మధ్యఉన్న దండువాగు కూడా ఉధృతంగా ప్రవహించింది. ఈ క్రమంలో వాగులో కారుతో సహ ఓ వ్యక్తి కొట్టుకుపోయాడు. మండల పరిధిలోని ఒమ్మెవరం గ్రామానికి చెందిన గోగినేని హనుమంతరావు దర్శి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. రోజులాగే కారులో దర్శి వెళ్తున్నాడు. దండువాగు వద్ద వరద ఉధృతి తెలియక కారును నీటిలో దింపాడు. నీటి ఉధృతికి కారు కొట్టుకు పోయింది. కొద్దిదూరం వెళ్లాక కారు గట్టు వద్ద ఆగింది. దీంతో హనుమంతరావు సమయస్ఫూర్తితో కారు డోరు తెరచుకొని బయటకు వచ్చాడు. సమీపంలోని చిల్లచెట్టును పట్టుకొని సాయం కోసం ఎదురు చూస్తునర్నాడు. ఈ విషయాన్ని నిడమానూరు గ్రామానికి చెందిన నూకతోటి అంజయ్య గమనించాడు. ఈదుకుంటూ వెళ్లి హనమంతరావును పట్టుకున్నాడు. నీటిలో కారుకొట్టుకు పోవడాన్ని గమనించిన గ్రామస్తులకు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ హరిబాబు ఉన్నతాధికారులకు సమాచారం అందించి ఘటనా స్థలానికి చేరుకున్నాడు. రెస్క్యూ టీం సిబ్బంది వాగు మధ్యలో చిక్కుపోయిన హనుమంతరావు. అంజయ్యను కాపాడి ఒడ్డుకు చేర్చారు.

ఎస్ఐ హరిబాబుకు అభినందలు

సమయస్ఫూర్తితో వ్యవహరించి ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడిని ఎస్ఐ హరిబాబు, రెస్క్యూ టీంను ఒంగోలు రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి, అభినందించారు. ఈ సందర్భంగా బాధితుడు గోగినేని హనుమంతరావు,వారి కుటుంబ సభ్యులు పోలీసులకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ సుజన్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకొని వ్యక్తిని కాపాడిని పోలీస్ సిబ్బంది, నిడమానూరు గ్రామస్తులను అభినందించారు.

బంద్ విజయవంతం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - చీరాల

బంద్ నిర్వహిస్తున్న నాయకులు

విద్యాసంస్థల బంద్ చీరాలలో విజయ వంతమైనట్లు ఎస్ఎఫ్ఐ చీరాల కార్యదర్శి వెంకట కుమార్ తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కార కోసం చేపట్టిన బంద్‌కు ప్రైవేటు ప్రభుత్వ విద్యా సంస్థలు స్వచ్ఛందంగా సహకరించారు. ఈ సందర్భంగా వెంకట కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత 10 సంవత్సరాలుగా ఆంధ్ర రాష్ట్రాన్ని మోసం చేస్తుందన్నారు. రాష్ట్ర హక్కులను కాలరాస్తూ ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్,. కడప ఉక్కు పరిశ్రమ కేంద్రాలు, విశ్వవిద్యాలయాలు హామీలను విస్మరించి ఆంధ్ర రాష్ట్రానికి తీరని అన్యాయం చేసినట్లు విమర్శించారు. 32 మంది ప్రాణత్యాగ ఫలితమే విశాఖ ఉక్కు అని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో అభివద్ధిని గాలికి వదిలేసినట్లు తెలిపారు. ప్రత్యేక హోదా ఊసే లేకుండా కేంద్రానికి సాగిలపడి రాష్ట్రాన్ని అమ్మేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, సాదిక్, ఆకాష్, సురేష్,నగాసెయి పాల్గొన్నారు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

చిన్నగంజాం : రైతులు, మత్స్యకారుల జోలికి వస్తున్న వారిపై ప్రభుత్వమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు. సింగరకొండ, మత్స్యకార్మికుల సంఘం జిల్లా నాయకుడు సైకం రాజశేఖర్ డిమాండ్ చేశారు. పెద్ద గంజాం గ్రా సర్వే నెంబరు 613,1160 లో 15 ఎకరాలను తమ తాతలు తండ్రుల కాలం నుంచి సాగు చేసుకుంటున్నా మత్స్యకారుల భూమి తమదంటూ ఒంగోలుకు చెందిన సుధీర్ కుమార్ బెదిరిస్తున్నాడని ఆరోపించారు కార్యక్ర మంలో కొక్కిలిగడ్డ ఏడుకొండలు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **THANIKONDA JOHNDAVID** S/o **JOHNRAJU,** R/o. D.no: 9-3, Motumala, ongole, Prakasam district, Andhra pradesh Have Changed my name to **TANIKONDA JOHNDAVID.** Hereafter my name is known as **TANIKONDA JOHNDAVID.**

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కందుకూరు

I.A.No. 771/2023
O.S.No. 111/2012

గద్దె వెంకటేశ్వర్లు - వాది
Vs
గద్దె రవి, మరియు ఇతరులు - ప్రతివాదులు

To,
R7: **గద్దె నరసమ్మ,** భర్త **వెంకటేశ్వర్లు,** వయస్సు 70 సం॥, పామూరు గ్రామము మరియు మండలం, ప్రకాశం జిల్లా.
R19: **గద్దె హర్షిత,** తండ్రి **గద్దె రవి,** వయస్సు 18 సం॥, ఆకులవీధి, పామూరు గ్రామము మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై తెలిపిన పిటిషన్ వాది ప్రతివాదులపై దాఖలు చేయుచున్నారు. మరియు మీ హాజరు నిమిత్తమై పిటిషన్ **తేది: 20-11-2023** న వాయిదా వేసియున్నారు. కావున మీరు నేరుగా గానీ, లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గానీ **తేది: 20-11-2023** న హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున కోర్టు వారు తీర్మానించెదరని తెలియజేయడమైనది.

// కోర్టు ఉత్తర్వుల మేరకు //
వి.సులోచన
వాదితరపు న్యాయవాది
కందుకూరు, ఫోన్: **77310 71818**

మాట్లాడుతున్న డీఈఓ సుబ్బారావు

ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి-దర్శి

ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేసి హాజరు శాతాన్ని పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ కాకర్ల రఘురామయ్య అధ్యక్షతన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలో సమయపాలన పాటించి కొత్తగా వచ్చిన పథకాలను అందరికీ అందే విధంగా చూడాలన్నారు. విద్యార్థుల్లో న్యాయకత్వ లక్షణాలను పెంపొందించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి ఎంఈఓ-2 రమాదేవి, తాళ్లూరు ఎంఈఓలు సుబ్బారావు, సుధాకరరావుతో పాటు కురిచేడు, దొనకొండ, ముండ్లమూరు ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి శ్రీనివాసరావు

మండల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-దర్శి

అధికారులు బాధ్యతగా పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని తాళ్లూరు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసీమారం వెంకటరావు అన్నారు. బుధవారం తాళ్లూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు అందరికి అందేలా పనిచేయాలన్నారు. అదే విధంగా అభివృద్ధిలో భాగస్వాములుగా పనిచేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలన్నీ అన్ని శాఖల అధికారులు పర్యవేక్షించి వారి అవసరాలు తీర్చాలన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలను అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కొండాయుగ కీర్తి, తహశీల్దార్ ప్రసాదరావు, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వరరెడ్డి, మారం ప్రియాంక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల 8,9,10 తరగతుల విద్యార్థులకు చెకుముకి సైన్స్ ప్రతిభ పరీక్షలు పాఠశాల స్థాయిల్లో జరుగుతాయని జెవివి మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి పివి కొండయ్య, ఐజక్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ పరీక్షలు సైన్స్‌లో పరిజ్ఞానం పెంపొందించేందుకు దోహద పడతాయని అన్నారు.

సైడ్ ఇవ్వలేదని బస్సు డ్రైవర్‌పై దాడి

మద్యం మత్తులో హాస్పిటల్ సిబ్బందినీ దుర్బాషలాడిన యువకులు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

బైక్‌కి సైడ్ ఇవ్వలేదని స్కూల్ బస్సుని అడ్డగించి డ్రైవర్ పై దాడి చేసిన ఘటన మార్టూరుకి సమీపంలోని గొట్టిపాటి హనుమంతరావుకాలనీ వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు బాధితుడి కథనం ప్రకారం అద్దంకి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేసి రిటైర్ అయిన శివయ్య మార్టూరులోని హర్షిణి కళాశాలకు చెందిన బస్సులో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కళాశాల విద్యార్థులను రాజుపాలెం గ్రామంలో దించిన శివయ్య తిరిగి మార్టూరు వస్తున్నాడు. ఈ క్రమంలో కోలలపూడి గ్రామానికి చెందిన యువకుడితో పాటు మరి కొంతమంది యువకులు మద్యం సేవించి బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి కింద పడటంతో వారిలోని ఒక యువకుడు గాయపడ్డాడు. గాయపడ్డ యువకుడిని బైక్‌పై ఎక్కించుకొని వస్తున్న యువకులు తమ ముందు వెళుతున్న స్కూల్ బస్సుకి సైడ్ ఇమ్మని హార్న్ కొడుతూ వస్తున్నారు. వర్షం పడి రోడ్డు అంతా బురదగా ఉండటంతో బస్సుకు సైడ్ ఇవ్వడం కుదరక డ్రైవర్ బస్సుని అలాగే ముందుకి పోనిస్తున్నాడు. సైడ్ ఇవ్వడంలేదని బస్సుని కొద్దిదూరం వెంబడించిన యువకులు అడ్డగించి డోర్ లాగి డ్రైవర్‌తో ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో ఒక్క సారిగా శివయ్య తలపై కోలలపూడికి చెందిన యువకుడు చేతిలో ఉన్న రాడ్‌తో కొట్టి డోర్‌ని బలంగా వెనక్కి నెట్టడంతో శివయ్య గాయపడ్డాడు. వెంటనే స్థానికులు స్పందించి శివయ్యను మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దాడిలో గాయపడ్డ డ్రైవర్

హాస్పిటల్ సిబ్బంది పైనా దురుసు ప్రవర్తన

మద్యం మత్తులో బైక్ పై నుంచి క్రింద పడి గాయపడిన యువకుడిని మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డ్రైవర్ శివయ్యపై దాడి చేసిన యువకుడు హాస్పిటల్‌కు చేరుకొని అక్కడ చికిత్స అందిస్తున్న స్టాఫ్ నర్స్, వైద్యసిబ్బందిని నానా దుర్భాషాలాడుతూ అక్కడే ఉన్న 108 సిబ్బంది నాగేశ్వరమ్మపై దురుసుగా ప్రవర్తించారు. గాయపడ్డ యువకుడికి, ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ శివయ్యకి చికిత్స అందిస్తున్న సూపరెంటెండెంట్ డాక్టర్ అశోక్‌రెడ్డి వెంటనే మార్టూరు ఎస్ఐ ముసలం శ్రీనివాసరావుకి మద్యం మత్తులో ఓ వ్యక్తి హాస్పిటల్‌లో సిబ్బందిపై దురుసుగా ప్రవరిస్తున్నడాని సమాచారమివ్వడంతో పోలీస్‌లు అక్కడకు చేరుకునే లోపే సదరు యువకుడు అక్కడి నుంచి ఉడాయించాడు. జరిగిన దాడిపై ఆర్‌టిసి విశ్రాంత డ్రైవర్ శివయ్య, 108 సిబ్బంది నాగేశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డాక్టర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ విధుల్లో ఉన్న సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించిన యువకుడిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మరమ్మతులు చేసేదెప్పుడు..?

ప్రజాశక్తి-కొండపి

కొండపిలోని పొదిలి రోడ్డులో పోలీసు స్టేషన్ నుంచి దుర్గా ఆసుపత్రి వరకు రోడ్డు మొత్తం చెరువులా తలపిస్తోంది. వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగున్నర సంవత్సరాలు అవుతున్నా ఈ సమస్యను ఇంతవరకు పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికారులు, నాయకులు అటువైపు నిత్యం వెళుతుంటారే తప్ప సమస్యను పట్టించుకోవడం లేదు. కొండపిలో చినుకుపడితే చిత్తడిగా ఉంటుంది. ఓ మోస్తరు వర్షానికే రోడ్డు మొత్తం బురద, చిత్తడిమయం అవుతోంది. నియోజకవర్గ కేంద్రమైన కొండపి కంటే చుట్టుపక్కల ఉండే గ్రామాలు ఎంతో మిన్నగా ఉంటాయని గ్రామస్థులు అంటున్నారు. పొదిలి రోడ్డులో గిరకల లోతుపైన నిలబడిన మురుగునీరుపై నిత్యం పాదచారులు, వాహనచోదకులు తరచూ ఇబ్బందులకు గురవుతున్నారు. కొండపిలో పూర్తి స్థాయిలో డ్రైనేజ్ లోపం ఉందని అధికారులు, నాయకులు పట్టించుకొని అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తే

పోలీస్ స్టేషన్ ముందు చెరువులా తలపిస్తున్న ఆర్అండ్‌బి రోడ్డు

బాగుటుందని తెలిపారు. పాలకులకు ప్రజల సమస్యలు పట్టడం లేదా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. మురుగునీరు పేరుకు పోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, చుట్టు పక్కల ఉండే చిన్నారులు, వృద్ధులు విషజ్వరాలతో మంచం పడుతున్నారని, ఈ సమస్యకు అడ్డుకట్ట వేసేదెవరు అని ప్రశ్నిస్తున్నారు. ప్రజా సమస్యలు తీర్చే నాయకుడి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఉన్నత స్థాయికి ఎదిగేలా చదవాలి : ఎమ్మెల్యే



విద్యార్థులకుప్రసంశా పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

విద్యార్థులు తమ పాఠశాల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా ఉన్నత స్థాయికి ఎదిగేలా చదవాలని మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఆడిటోరియంకు శంఖుస్థాపన అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి తన కుటుంబంతో పాటు సమాజాన్ని ఉన్నత స్థితికి చేర్చేందుకు ప్రాథమిక దశ నుంచి మంచి విద్యా బుద్ధులతో చదవాలన్నారు. ఈ సందర్భంగా హబీబుల్లాబేగ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం పొందిన భువనేశ్వరి, ద్వితీయ స్థానం సాధించిన ప్రవీణ్‌లకు నగదు పారితోషికంతో పాటు ప్రసంశాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు పి కరీమూన్ బేగం, హబీబుల్లాబేగ్, సంస్థ ఛైర్మన్ కరిముల్లాబేగ్, వైసిపి నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థకు విరాళాల వెల్లువ

ప్రజాశక్తి-పొదిలి

పొదిలిలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు విరాళాలు వెల్లువెత్తున్నాయి. బుధవారం ఆ సంస్థ డైరెక్టర్‌లలో ఒకరైన వెలిశెట్టి వెంకటేశ్వర్లు (శ్రావణి) ఫ్రీజర్ల ఏర్పాటుకు రూ.4 లక్షలు సంస్థకు విరాళంగా ఇచ్చారు. స్థానిక ఎన్‌ఏపి సంప్ వద్ద జరిగిన కార్యక్రమంలో శ్రావణివెంకటేశ్వర్లు ఈ నగదు మొత్తాన్ని సంస్థ సభ్యులకు అందించారు. అనంతరం మరో ఫ్రీజర్ బాక్స్ కోసం మరొక డైరెక్టర్, మాజీ శివాలయం ట్రస్టుబోర్డు ఛైర్మన్ శామంతపుడి నాగేశ్వరరావు తన వంతు విరాళాన్ని సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మెన్ మువ్వల పార్థసారథి, కన్వీనర్ కె యల్లమందారెడ్డి, అధ్యక్షుడు కల్లం సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు అశోక్, కార్యదర్శి వెంకట్రావు, ట్రెజరర్ చిరంజీవి, వెంకట నారాయణరావు (పెదబాబు), శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, శేషగిరి, వినోద్, షేక్ బాజీ, నాట్యాచార్యులు శివశంకర్, వినోద్‌రాజ్, వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీరారెడ్డికి నివాళి

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండలం సానికవరం గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరుడు, రైతు సంఘం మాజీ నాయకుడు గాలి చిన్న వీరారెడ్డి మృతికి పలువురు నివాళి అర్పించారు. బుధవారం ఆయన మృతదేహానికి సానికవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి... వీరారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. సిపిఎం మార్కాపురం ప్రాంత నాయకులు డి సోమయ్య, డికెఎం రఫీ, గుమ్మా బాలనాగయ్య తదితరులు వీరారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సిపిఎం, రైతు సంఘంలో పనిచేసిన గాలి చిన్న వీరారెడ్డి మృతి చెందడం బాధాకరమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జివి కొండారెడ్డి వేరొక ప్రకటనలో నివాళి అర్పించారు.

గాలి చిన్న వీరారెడ్డి

మద్యాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గడువు తీరిన మద్యం పారబోత

ప్రజాశక్తి-శింగరాయకొండ

మద్యం షాపుల్లో గడువు తీరిన మద్యాన్ని బుధవారం నాడు ఎక్సైజ్ పోలీసులు పారబోశారు. గడువు తీరిన మద్యంపై ఒంగోలు ఎక్సైజ్ పోలీసులకు ఉన్నతాధికారులు సమాచారం అందించడంతో శింగరాయకొండలోని రెండు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉన్న మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పరిశీలించి పారబోశారు. ప్రశాంతి థియేటర్ వద్ద 50 బీజర్ బీరు బాటిళ్లు, కందుకూర్ రోడ్డులోని దవన్న మద్యం షాప్‌లో 32 బీజర్ బీరు బాటిళ్లను పరిశీలించి మూతలు తీసి రోడ్డుపై పారబోశారు. ఈ బీజర్ బాటిళ్ళ గడువు 21-7-2023తో ముగిసింది. ఈ నేపథ్యంలోఉన్నతాధికారులు సమాచారం అందించడంతో ఆ బాటిల్స్‌ను షాపుల ముందే మూతలుతీసి రోడ్డుపై పారబోశారు.

అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అనుమతి లేకుండా దీపావళి మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని యర్రగొండపాలెం ఎస్ఐ జి కోటయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతిఒక్కరూ టపాసులు కాల్చుకోవటం అనవాయితీ అని తెలిపారు. అనుమతి లేకుండా ఎవరైనా టపాసులు విక్రయలు నిర్వహిస్తే వారిపై కేసు నమోదు చేస్తామని అయన హెచ్చరించారు. టపాసుల షాపులకు లైసెన్సులు పొందే నిర్వాహకులు వారికి కేటాయించిన ప్రదేశాలలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. షాపుకు షాపుకు మధ్య దూరం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. షాపుల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన సదుపాయాలను సమకూర్చుకోవాలన్నారు. ప్రజలు కూడా ఆనందంగా దీపావళి జరుపుకోవాలని తెలిపారు.

ఎస్ఐ కోటయ్య

పుల్లల చెరువు : దీపావళి పండుగను పురస్కరించుకొని ఎవరైనా బాణాసంచా విక్రయించదలచిన వారు సంబంధిత పోలీస్ అధికారుల వద్ద తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ వై శ్రీహరి తెలిపారు. అనుమతులు తీసుకున్న తర్వాత నిబంధనలకు మాత్రమే షాపులను నడపాలన్నారు. ఎటువంటి అనుమతి లేకుండా అనధికారికంగా ఎవరైనా బాణాసంచా విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

జాతీయ పోటీల్లో రజిత పతకం సాధించిన ఎపి ఖోఖో జట్టు

ఖోఖోలో బాలుర జట్టు ప్రతిభ

ప్రజాశక్తి - పంగులూరు

ఈనెల 4నుండి 8వరకు గోవాలో జరిగిన 37వ జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలుర ఖో ఖో జట్టు రజిత పతకం సాధించింది. ఆంధ్ర ప్రదేశ్ జట్టు లీగ్ విభాగంలో పశ్చిమబెంగాల్, గోవా జట్లపై విజయకేతనం ఎగరవేసి సెమీఫైనల్స్ కు చేరుకుంది. సెమీఫైనల్‌లో రెండు పాయింట్లు తేడాతో కేరళ జట్టుపై పరాజయం పొంది రజిత పతకం సాధించింది. ఈ విజయంలో జట్టుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన శాఫ్ విసి అండ్ ఎండి ధ్యాన్ చంద్‌కు ఎపి ఖోఖో అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బాచిన చెంచు గరటయ్య, ప్రెసిడెంట్ టిఎస్ఆర్‌కె ప్రసాద్, శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య, ప్రకాశం జిల్లా ఖో ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె భాస్కరరావు, బి కాశీ విశ్వనాథరెడ్డి, రాష్ట్ర ఖో ఖో కార్యదర్శి సీతారామిరెడ్డికి జట్టు కోచ్‌లు డిఎల్ రెడ్డి, పి బ్రహ్మానాయుడు, మేనేజర్ కె హనుమంతరావు, మెంటర్ కె శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థిని గీతికశ్రీ

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈనెల 9నుండి విశాఖ జిల్లా అరకులో జరగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు సూర్యపల్లి విపి అండ్ జి ఎస్ఎం ఉన్నత పాఠశాల విద్యార్థిని బొర్రా గీతికశ్రీ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసశర్మ తెలిపారు. రాష్ట్ర వాలీబాల్ పోటీలకు తమ విద్యార్థిని ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. ఈ మేరకు విద్యార్థులతో పాటు క్రీడా ఉపాధ్యాయులు జివిఎస్ నాగేశ్వరరావును పాఠశాల పాలకవర్గ అధ్యక్షులు వేపూరి చలమయ్య, రావు రమణారావు, కార్యదర్శి కృష్ణారావులు అభినందించారు.

వేతనాలు ఇవ్వాలని ఆందోళన చేస్తున్న కార్మికులు

పారిశుధ్య కార్మికుల జీతాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

గత మూడు రోజుల నుండి సమ్మె చేస్తున్న ఇంకొల్లు పంచాయతి కార్మికులకు ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా మద్దతు ప్రకటించింది. పారిశుధ్య కార్మికుల రిలే దీక్షల శిబిరాన్నిసందర్శించి కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు షేక్ మహ్మద్ బాషా, ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకరరావు, ఎఐఆర్‌డబ్ల్యుఒ మహిళా సంఘం నాయకులు శారా మాట్లాడారు. దీక్షా శిబిరంలో కార్మికులకు సంపూర్ణ మద్దతునిస్తూ టియుసిఐ ప్రచురించిన కరపత్రం ఆవిష్కరించారు. ఎంపిడిఒ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. ఎంపిడిఓకు వినతి పత్రం అందజేశారు.

పూర్తిస్థాయి ఎంపీడీఓగా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - కారంచేడు

పూర్తిస్థాయి ఎంపీడీఓగా పి లక్ష్మీనారాయణను నియమిస్తున్నట్లు జెడ్‌పి సీఈవో జాలిరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా పని చేసిన విజయలక్ష్మిని అనంతపురం జిల్లా ఉరవకొండ డివిజన్ డ్వామా పిడిగా పదోన్నతిపై వెళ్లడంతో ఆమె స్థానంలో ఇంచార్జ్ ఎంపీడీఓగా కొనసాగుతున్న ఆయనను పూర్తిస్థాయి ఎంపీడీఓగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చారు.

విద్యాసంస్థల బంద్ సంపూర్ణం

బాపట్లలో విద్యాసంస్థల బంద్ చేయిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

చీరాలలో బంద్ చేయిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్‌లో సంపూర్ణ బంద్ జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య తెలిపారు. ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలను బంద్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణకు కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా విద్యాసంస్థల బంద్ చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన ప్పటి నుండి దేశంలోని ప్రభుత్వ సంస్థలు అన్నిటిని అమ్మేస్తున్నారని అన్నారు. ఇది దేశద్రోహం కాదా అని ప్రశ్నించారు. గత 10సంవత్సరాలుగా ఆంధ్ర రాష్ట్రాన్ని మోసం చేస్తూ వస్తుందని అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులను కాలరాస్తుందని అన్నారు. ప్రత్యేక హొదా, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమ, కేంద్ర విశ్వ విద్యాలయాల స్థాపన హామీలను విస్మరించిందని అన్నారు. విభజన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాజిత్, రోహిత్, భాను తేజ్, వెంకటేష్, రాజు, హర్ష కార్తీక్ పాల్గొన్నారు.

అద్దంకి : విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన విద్యా సంస్థల బంద్‌లో అద్దంకిలో సంపూర్ణంగా బుధవారం నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ అద్దంకి డివిజన్ నాయకులు అశోక్ తెలిపారు. పట్టణంలో నిర్వహిస్తున్న పలు ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థలను బంద్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణకై, కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికై చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా బంద్ విజయవంతం చేసినట్లు తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశంలోని ప్రభుత్వ సంస్థలన్నిటిని కూడా అమ్మేస్తున్నారని అన్నారు. ఇది దేశద్రోహం కాదా అని ప్రశ్నించారు? ప్రత్యేక హొదా సాధిస్తానని, పరిశ్రమలను స్థాపిస్తానని అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి గడచిన ఐదేళ్లలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు యువతకు కల్పించిన ఉద్యోగాలు రాష్ట్ర ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎ ప్రేమ్ కౌటోల్య, జూనియర్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపల్లె : విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యా సంస్థల బంద్‌లో రేపల్లె, నగరం మండలాల్లో 12 కాలేజిలు, 40 స్కూల్స్ సంపూర్ణ బంద్ జరిగినట్లు ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎం సూర్య ప్రకాష్ తెలిపారు. ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలను బంద్ చేశారు. స్వచ్ఛందంగా బందుకు సహకరించిన విద్యాసంస్థల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణకు, కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికై చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా బంద్ విజయవంతం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు నవీన్, తులసి రాముడు ఎస్ఎఫ్ఐ నాయకులు అరవింద్, ప్రసాద్, శివరామకృష్ణ, రాజు, వెంకటేష్, నికిత, మంజూర, మీన, ఐశ్వర్య, భవాని, హేమనాగశ్రీ, హైమశ్రీ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

భట్టిప్రోలు : విశాఖ ఉక్కు ప్రైవేటు కరణ ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా సంస్థల బంధు బుధవారం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి మనోజ్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో చేపట్టిన ఈ బందుకు సహకరించిన విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జగదీష్ ఉన్నారు.

చీరాల : విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్ సంపూర్ణంగా జరిగిందని ఎస్ఎఫ్ఐ కార్యదర్శి వెంకట కుమార్ అన్నారు. విశాఖ ఉక్కు ఉద్యమానికి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా కార్మికులకు సంఘీబావంగా విద్యార్థి, యువజన సంఘాలు బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, సాదిక్, ఆకాష్, సురేష్, నగసాయి పాల్గొన్నారు.

రేపల్లెలో బంద్ చేయిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

అద్దంకి బంద్‌లో మాట్లాడుతున్న తంగిరాల వెంకటేశ్వర్లు

భట్టిప్రోలులో బంద్ చేయిస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యదర్శి

పునాదులకే పరిమితమైన వైద్యకళాశాల

సిపిఎం నేతలు ఎంఎ గఫూర్, డి రమాదేవి పరిశీలన

ప్రజాశక్తి - బాపట్ల

రెండేళ్లుగా వైద్య కళాశాల నిర్మాణ పనులు పునాదులకే పరిమితమయ్యాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి అన్నారు. ప్రజారక్షణ భేరి బస్సు యాత్రలో భాగంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, నాయకులు కె ప్రభాకరరెడ్డి, డి దయారమాదేవి, సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్యతో కలిసి నిర్మాణ దశలో ఉన్న వైద్య కళాశాల పనులను బుధవారం పరిశీలించారు. మెగా కన్ స్ట్రక్షన్ పేరుతో రాష్ట్రంలో వైద్య కళాశాల నిర్మాణ పనులను సిఎం జగన్ మోహన్ రెడ్డి బినామీలకు అప్పగించారని అన్నారు. ప్రత్యక్షంగా ప్రజల కళ్ళు కప్పి, పరోక్షంగా రాష్ట్రంలో వైద్య కళాశాలల నిర్మాణ పనులు జగన్మోహన్ రెడ్డి బినామీలతోనే జరుగుతున్నాయని అన్నారు. రూ.535కోట్లతో నిర్మిస్తున్న వైద్య కళాశాల పనులు పునాదులు దాటని పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఇదే మాదిరిగా నిర్మాణ పనులు కొనసాగితే ఎప్పటికీ పూర్తవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో అనేక రహదారులు గుంటల మైయంగా ఉన్నాయని అన్నారు. బటన్ నొక్కుడు కార్యక్రమం ప్రధాన ఎజెండాగా పెట్టుకున్న సిఎం రాష్ట్రంలో ఇతర సమస్యలను గాలికి వదిలేసారని అన్నారు. అది గాక బటన్ నొక్కుడు కార్యక్రమం పేరుతో ఆయనకు ఇష్టం లేని ప్రతిపక్షాలపై దుమ్మెత్తి పోయడమే పనిగా సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రసంగాలు కొనసాగుతున్నాయని అన్నారు. బాపట్లతో పాటు రాష్ట్రంలో మంజూరైన మెడికల్ కళాశాలల నిర్మాణం స్థితిగతులపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పనులు పరిశీలించిన వారిలో సిపిఎం రాష్ట్ర కమిటీ నాయకులు కె ఉమామహేశ్వరరావు, సిపిఎం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, వై భాస్కరరావు, కె నాగేశ్వరరావు ఉన్నారు.

వైద్యకళాశాల పనులు పరిశీలిస్తున్న సిపిఎం నేత గఫూర్

ఎన్‌సిసి విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని స్వర్ణ జెడ్‌పి ఉన్నత పాఠశాల ఎన్‌సిసి 23వ ఆంధ్ర బెటాలియన్ విద్యార్థులకు బుధవా రం బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించి నట్లు స్వర్ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ బయ్యా శంకర్ తెలిపారు. ప్రతి సంవత్సరం ఎన్సిసి 8వ తరగతి నుండి స్వర్ణ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రవేశం జరుగుతుందని తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులకు ఎత్తు, బరువు కొలతలతో పాటు రక్త వర్గీకరణ పరీక్షలు అవసరం ఉంటుందని ఎన్సిసి ఇన్చార్జ్, పిఈటి కట్ట ప్రసాద్ తెలిపారు.

బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేస్తున్న బయ్యా శంకర్

పంచాయితీ సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచి

ఓపెన్ డ్రైనేజీలను నిర్మించాలి

ప్రజాశక్తి - చిన్నగంజాం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఓపెన్ డ్రైనేజ్ కాలువ తీయాలని సర్పంచి రాయని ఆత్మరావ్ కోరారు. స్థానిక పంచాయతీలో ఎన్ఆర్ఇజిఎస్ పనులు గుర్తించేందుకు గ్రామ సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి రాయని ఆత్మ రావ్ మాట్లాడుతూ సచివాలయం ఒకటి పరిధిలో మూడు కిలోమీటర్లు, రెండు పరిధిలో మూడు కిలోమీటర్లు కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. 2024 - 25సంవత్సరంలో పనులు చేపట్టుటకు గ్రామంలో మొత్తం 24పనులను గుర్తించి గ్రామసభ ఆమోదంలో తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ మస్తాన్‌రావు, ఉపాధి హామీ పథకం ఎపీఒ జె లక్ష్మీదేవి పాల్గొన్నారు.ం

10న పాఠశాల స్థాయి చెకుముకి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

పాఠశాల స్థాయి చెకుముకి సంబరాలు ఈనెల 10న శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జెవివి ప్రధాన కార్యదర్శి కుంచా వెంకటరామమోహనరావు, కార్యదర్శి ఇంకొల్లు రంగారావు, కాటూరి నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. 10న మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయి చెకుముకి సంబరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను మండల స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షకు హాజరు కావాలని కోరారు.

బాలినేని వల్లే మంత్రినయ్యా..

ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-కనిగిరి

సాధికారత న్యాయం కోసం ముఖ్యమంత్రి జగనన్న ఆదేశానుసారం మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి రెండు అడుగులు వెనక్కి వేయడం వల్లే తాను మంత్రిని అయ్యానని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. వైసిపి సాధికారత బస్సు యాత్ర సందర్భంగా కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండ్ సెంటర్‌లో బుధవారం బహిరంగ సభ నిర్వహించారు. సభలో మంత్రి సురేష్ మాట్లాడుతూ సుపరిపాలన అందిస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి దళిత సామాజిక వర్గానికి చెందిన తనకు విద్యాశాఖ మంత్రిగా పదవి ఇచ్చి సామాజిక న్యాయం అంటే ఏమిటో చూపించారన్నారు. ప్రతి పేదవానికి పేదరికం కారణంగా విద్య దూరం కాకూడదని. విద్యకు ప్రాధాన్యత కల్పిస్తే ప్రతిపక్షం గగ్గోలు చేసిందన్నారు. సినిమాలో డైలాగులు చెప్పడం కాదని, తమ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులతో ఇంగ్లీష్ మాట్లాడాలని పవన్ కళ్యాణ్‌కు సవాల్ విసిరారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను వచ్చే ఎన్నికల్లో ఆదరించి జగన్మోహన్ రెడ్డి కి బహుమతిగా ఇవ్వాలని కోరారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ సిఎం బొమ్మతో సాధికార యాత్ర చేస్తున్న తమకు ప్రజల పెద్దఎత్తున ఆదరణ లభిస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి తోనే సామాజిక విప్లవం సాధ్యమైందన్నారు. చంద్రబాబు పాలనలో న్యాయం, సాయం రెండు లేవన్నారు. డిప్యూటీ సిఎం అంజాద్ బాషా మాట్లాడుతూ గతంలో మైనారిటీలకు రాజకీయపరంగా ఎలాంటి పదవులు లభించలేదన్నారు. జగనన్న మైనారిటీల తోపాటు అన్ని వర్గాల వారికి అవకాశం కల్పిస్తూ ఉప ముఖ్యమంత్రులు, మంత్రి పదవులను ఇచ్చి న్యాయం చేశారన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెండు నెలల్లో నడికుడి రైల్వే లైను పూర్తయి కనిగిరికి రైలు వస్తుందన్నారు. 8 సార్లు మాగుంట కుటుంబాన్ని ఈ ప్రాంత ప్రజలు ఆదరించారన్నారు. కనిగిరిలో రూ.50 లక్షలతో స్పందన భవనం నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధి గురించి వివరించారు. తొలుత మండల పరిధిలోని నందన మారెళ్ళ వద్ద ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో సాధికార యాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, రాజ్యసభ సభ్యులు విజయ్ సాయి రెడ్డి, బీద మస్తాన్ రావు, ఎమ్మెల్సీ పోతుల సునీత, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి, ఎంపిపి దంతులూరి ప్రకాశం, ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి ఖాన్, వైసిపి నాయకులు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, సంగు సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు తమ్మినేని సుజాత రెడ్డి, దేవకి రాజీవ్, వేల్పుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలి

- శాంతిని నెలకొల్పాలి
- ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపి శాంతిని నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పిలుపు నిచ్చారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో యుటిఎఫ్ కార్యాలయంలో పాలస్తీనాపై దాడిని ఖండిస్తూ బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పాలస్తీనా స్థానికులుగా అరబ్బులు ఉన్నారన్నారు. యూదులు ప్రపంచంలోని అనేక ప్రాంతాల నుంచి వలస వచ్చారన్నారు. వలస వచ్చిన వారికి ఆసరా ఇచ్చిన అరబ్బుల భూభాగాన్ని యూదులు ఆక్రమించి విస్తరించడం ప్రారంభించారన్నారు. ఇది 1914లో ప్రారంభమై 1945 వరకూ కొనసాగినట్లు తెలిపారు. ఆ తర్వాత ఐక్యరాజ్యసమితి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

రెండు దేశాలను ఏర్పాటు చేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ తీర్మానాన్ని ఇజ్రాయెల్ వ్యతిరేకించినట్లు తెలిపారు. దానికి అమెరికా మద్దతుగా నిలబడిందన్నారు. అమెరికా అండ చూసుకుని ఇజ్రాయెల్ నిరంతరం దురాక్రమణ కొనసాగిస్తూ వుందన్నారు. ఫలితంగా పాలస్తీనాకు కేవలం 'గాజా స్ట్రిప్, వెస్ట్ బ్యాంక్' రెండు ప్రాంతాలు మాత్రమే మిగిలాయన్నారు. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధం కేవలం అమెరికా ఎన్నికల కోసమే తప్ప ఇజ్రాయెల్, పాలస్తీనా రెండు దేశాల కోసం కాదన్నారు. యుద్ధంలో అనేక మంది అమాయక ప్రజలు, చిన్నారులు చనిపోతున్నట్లు తెలిపారు. భారత దేశం కూడా దురాక్రమణను వ్యతిరేకంగా మాట్లాడక పోవడం దారుణమైన విషయమన్నారు. ప్రజాస్వామ్య వాదులు, శాంతి కాముకులు ఈ దురాక్రమణ యుద్ధాన్ని ఖండించి పాలస్తీనాకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ ఎవి. పుల్లారావు అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం మాజీ కార్యదర్శి వై.సిద్దయ్య, వివిధ ప్రజాసంఘాల నాయకులు శేషయ్య, సిహెచ్.రాంబాబు దామా శ్రీనివాసులు, ఉమామహేశ్వరి, తాళ్ళూరి వెంకటేశ్వర్లు, జివి. రాగయ్య, హరిబాబు, జివి.సుజాత, సిహెచ్.జయప్రకాష్, కె.సుబ్బా రావు, బి.వెంకట్రావు, దార్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

10 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు : జెవివి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

చెకుముకి సైన్స్ సంబరాలు ప్రపంచ సైన్స్ దినోత్సవం రోజైన ఈనెల 10న ప్రారంభమవుతాయని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.జయప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ స్థాయిల్లో నిర్వహించనున్న చెకుముకి సంబరాలు ఈనెల 10న పాఠశాల స్థాయి, 30న మండల స్థాయి, డిసెంబర్ 17న జిల్లాస్థాయి, 2024 జనవరి 27, 27 తేదీల్లో రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సైన్స్ సంబరాల్లో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు శాస్త్రీయ దక్పథం, సైన్స్-శాంతి- అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, మూఢనమ్మకాలు, లింగ సమానత్వం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పిల్లల్లోని సజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఇతర యాజమాన్యాల ఉన్నత పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈనెల 10న పాఠశాల స్థాయి చెకుముకి పరీక్ష రాయనున్నారన్నారు. ప్రతి తరగతిలోనూ మొదటిస్థానం పొందిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి ఈనెల 30 న జరుగనున్న మండల/పట్టణ స్థాయి చెకుముకి సంబరాలకు పంపాల్సి ఉంటుందన్నారు. శాస్త్రీయ సమాజ నిర్మాణ కపిలో భాగంగా జరుగుతున్న ఈ చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేసేందుకు తగిన సహాయ సహకారాలు అందించాలని ఉపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, విద్యాధికారులు, జెవివి కార్యకర్తలను ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

తాళ్లూరు : ప్రజల సమస్యలు పరిష్కరించాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిదులు మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు ఎడమకంటి వెంకటేశ్వరరెడ్డి, మంచాల ప్రియాంక నాగార్జునరెడ్డి, తహశీల్దారు, ఎంపిడిఒ, కోఆప్షన్ మెంబర్ కరీముల్లా, సొసైటీ అధ్యక్షుడు యాడిక యలమందారెడ్డి కె. జయరాం ఒడ్డి అధికారులు,ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆరోపణలు రుజువు చేయడానికి సిద్ధమేనా..?

మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌కు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సవాల్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

కొత్తపట్నం సమీపంలో నిర్మిస్తున్న ఓ బ్రిడ్జి విషయంలో తాను అవినీతికి పాల్పడ్డానని మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ విమర్శిస్తున్నారని, తనపై చేసిన అవినీతి ఆరోపణలు రుజువు చేయడానికి జనార్ధన్ సిద్ధమా...? అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. బాలినేని బుధవారం విలేకర్లతో మాట్లాడారు. తెలుగుదేశం హయాంలో బ్రిడ్జి పనులు 80 శాతం పూర్తి అయ్యాయని, తాను 20 శాతం పని కూడా పూర్తి చేయలేదని, పని చేసేందుకు కాంట్రాక్టర్‌ను డబ్బులు అడిగానని జనార్ధన్ విమర్శిస్తున్నారని, వాస్తవంగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనికి డబ్బులు తీసుకుంది దామచర్ల జనార్ధనేనని బాలినేని విమర్శించారు. ఈవిషయం బ్రిడ్జి పని చేసే కాంట్రాక్టరే తనకు స్వయంగా చెప్పినట్లు ఆయన తెలిపారు. ఆకాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేసింది కూడా జనార్ధనేనని వివరించారు. పనులు సక్రమంగా జరగడం లేదని కాంట్రాక్టర్‌ను పిలిపించి అడిగితే సెంట్రల్ గవర్నమెంట్ స్కీం క్లోజ్ అయ్యిందని, అందుకే పనులు జరగడం లేదని

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని

కాంట్రాక్టర్ తనకు చెప్పాడని తెలిపారు. అప్పుడు రూ.40లక్షల విలువైన మెటీరియల్ ఏర్పాటు చేసి తాను పని పున: ప్రారంభానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆ సమయంలో కాంట్రాక్టర్‌తో తాను మాట్లాడినట్లు తెలిపారు. ఇంకా రూ.2 కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జనార్ధన్ వాస్తవాలు ప్రజలకు చెప్పకుండా అవాస్తవాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనార్ధన్ డబ్బులు తీసుకోని, తనపైన నిందలు వేయడం ఏంటని ఆయని ప్రశ్నించారు. జనార్ధన్ అప్పట్లో డబ్బులు తీసుకున్నాడని తాను ఎక్కడైనా ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని, ఏ గుడికైన వచ్చి ప్రమాణం చేస్తానని చెప్పారు. తాను డబ్బులు తీసుకున్నానని జనార్ధన్ ఎక్కడ ప్రమాణం చేస్తాడో చెప్పాలని సవాల్ విసిరారు. తనపై చేసిన అవినీతి ఆరోపణలను రుజువు చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు దేవినేని ఉమా వాస్తవాలు తెలుసుకోకుండా జనార్ధన్ ఏం చెబితే అది మాట్లాడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు.

ప్రమాణం చేయటానికి సిద్ధమే..

- నేడు లాయర్ పేట సాయిబాబా గుడికి వస్తా
- ఎమ్మెల్యే బాలినేని రావాలని దామచర్ల ప్రతి సవాల్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తాను ఏ కాంట్రాక్టర్ వద్ద డబ్బులు తీసుకోలేదని, ఈవిషయమై ప్రమాణం చేసేందుకు సిద్ధమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు స్పష్టం చేశారు. గురువారం లాయర్‌పేట సాయిబాబా గుడికి వస్తే ప్రమాణం చేద్దామని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డికి దామచర్ల ప్రతి సవాల్ విసిరారు. జనం కోసం జనార్ధన్, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం ఒంగోలు నగరంలోని 9వ డివిజన్ (కొప్పోలు)లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధన్ ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేసి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దామచర్ల మాట్లాడారు. కొత్తపట్నం బకింగ్ కెనాల్ రోడ్డు కొద్దిపాటి వర్షాలకే దెబ్బతిని ప్రజల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తాము సందర్శించి, ప్రజల ఇబ్బందులకు గుర్తించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని వైసిపి ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించామన్నారు. అయితే ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

రెడ్డి తనకు చీము నెత్తురులేదని, ఏవేవో పిచ్చి మాటలు మాట్లాడతారన్నారు. తాను ఏదో కాంట్రాక్టర్ వద్ద డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు చేస్తున్నాడన్నారు. లాయర్‌పేట సాయిబాబా గుడికి గురువారం వస్తానని, ఆ కాంట్రాక్టర్ వద్ద డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేస్తానన్నారు. టిడ్కో గృహాలు, మంచినీటి పథకంలో తాను అవినీతి చేశానని మాట్లాడుతున్నారని నిరూపించడానికి మీరు సిద్ధంగా ఉన్నారా అనిప్రశ్నించారు. బాలినేని చేసిన దందాలు, భూకబ్జాలు ప్రజలందరూ గమనిస్తున్నారని, ఆయనకు అసహనం పెరిగిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, కపిల్ బాషా, మదన్, పి. వెంకటేశ్వర్రెడ్డి, నడిపినేని భాస్కర్, వడ్డమూడి మునీంద్ర, అజీమునిషా, కాట్రగడ్డ రమ్య, బండపాటి హరిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

అర్జీలను విచారించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఓటు నమోదు కోసం వచ్చిన అర్జీలను వెంటనే విచారించాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఛాంబర్ లో ఓటరు జాబితా తయారీ పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 4,5 తేదీల్లో ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్పెషల్ క్యాంపులో వచ్చిన అర్జీలు విచారణ జరిపి కంప్యూటర్లలో నమోదు చేయాలన్నారు. ఇవిఎంల మొదటి దశ చెకింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకట రమణ, కె.కోటేశ్వరరావు బిఎస్‌పి నాయకుడు కెవి.రామకష్ణ, బిజెపి నాయకుడు ఎన్.కోటేశ్వరరావు సిపిఐ నపాయకుడు డి.రవి ఐఎన్‌సి ప్రతినిధి షేక్ మహమ్మద్ గౌస్ బాషా, మాల్యాద్రి, వైసిపి ప్రతినిధులు పాల్గొన్నారు.

పిసిసి జనరల్ సెక్రటరీగా 'పేరం'

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామానికి చెందిన పేరం ప్రభాకర్‌ను ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ సందర్భంగా పేరం ప్రభాకర్ మాట్లాడుతూ 1970లో జిల్లా ఆవిర్భావం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఒంగోలు ప్రాంతానికి చెందిన వారికి అవకాశం ఇవ్వలేదన్నారు. రెట్టించిన ఉత్సాహంతో పార్టీ అభివృద్ధికి పని చేస్తానని తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి.వేణుగోపాల్, రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు ఈ సందర్భంగా ప్రభాకర్ ధన్యవాదాలు తెలియజేశాడు.

ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -వేటపాలెం

వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీలోని మక్కెనవారిపాలెంలో కంభం బాలమురళి ఇంటి వద్ద చింత హరీష్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలేటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ కాటి మేషక్, చింతశాలెం రాజు, నూకతోటి అఖిల్, దేవరపల్లి చంద్రహాస్, గొర్రె ముచ్చు బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

కమినషర్‌కు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - చీరాల

చీరాల మున్సిపల్ కమిషనర్ విధులు నిర్వహిస్తున్న కె.రామచంద్ర రెడ్డికి స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. రామచంద్రారెడ్డి ఇప్పటి వరకూ గ్రేడ్-1 కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇక నుంచి స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా విధులు నిర్వహించనున్నారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉద్యోగోన్నతి పొందిన సందర్భంగా కమిషనర్ రామచంద్రారెడ్డికి మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

అవసరమైతేనే హిస్టరెక్టమీ ఆపరేషన్ చేయాలి

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో అవసరమైతేనే హిస్టరెక్టమీ ఆపరేషన్ చేయాలని, ముఖ్య కారణాలు రికార్డుల్లో నమోదు చేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్‌లో హిస్టరెక్టమీ(గర్భ సంచి తొలగించటం)పై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శస్త్ర చికిత్స కేవలం రిజిస్టర్ ఒబిజి (ప్రసూతి, గైనకాలజీ డాక్టర్) మాత్రమే చేయాలన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రతి ఆసుపత్రితో హిస్టరెక్టమీ ఆపరేషన్‌కు గల ముఖ్య కారణాలు రికార్డులలో పొందు పరచాలని ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు ఒక్కసారి జిల్లా స్థాయి హిస్టెరెక్టమీ కమిటీ రికార్డులను పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన విధానాలకు విరుద్ధంగా ఉన్న ఆసుపత్రుపై క్లినికల్ ఎస్టాబ్లిష్ చట్టంలో కేసు నమోదు చేస్తామన్నారు. హిస్టరెక్టమీ కమిటీ ప్రతి నెల ప్రభుత్వ, ప్రవేట్ హాస్పెటల్స్ లో ఆడిట్ చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎస్ఎస్. మూర్తి, ఎన్‌సిడి .ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భగీరధి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, డాక్టర్ సంధ్య రాణి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ పద్మజ, డిఐఒ, డాక్టర్ నాగార్జున, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మాక్ పోలింగ్

ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఈవిఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సి) ప్రక్రియలో భాగంగా గురువారం నుంచి మాక్ పోలింగ్ ప్రక్రియ చేపట్టినట్లు కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక మామిడి పాలెంలోని ఇవిఎం గోదామును బుధవారం సందర్శించారు. ఎఫ్ఎల్‌సి తీరును పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి వివరాలను తెలుసుకొని రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బ్యాలెటింగ్, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్స్ పరిశీలన దాదాపుగా పూర్తయిందన్నారు. మొత్తంలో 0.5 శాతం లోపాలను గుర్తించామని, వీటిని తయారు చేసిన కంపెనీకి తిప్పి పంపించామన్నారు. ఇవిఎంలు కొత్తవి కావటంతో తిరస్కరణకు గురైన వారి సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఈ పరిశీలన ప్రక్రియ మొత్తం కట్టుదిట్టమైన భద్రత మధ్య రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అత్యంత పారదర్శకంగా నిర్వహించామన్నారు. గురువారం నుంచి రెండు రోజుల పాటు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వారు ఎంపిక చేసుకున్న ఇవిఎంలకు మాక్ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ ప్రక్రియ లోనూ ప్రతినిధులను భాగస్వాములను చేయాలని రాజకీయ పార్టీలకు ఆయన సూచించారు. కలెక్టర్ వెంట డిఆర్ఒ ఆర్.శ్రీలత, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి **గృహ** నిర్మాణాలు, ఓటర్ల క్లెయిమ్స్ పై గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో గత మూడు వారాల నుంచి ఇప్పటి వరకు గృహ నిర్మాణాల స్టేజి కన్వెన్షన్ చేయని అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశంలో గృహ నిర్మాణ శాఖ అధికారులకు చెప్పినప్పటికీ స్టేజి కన్వర్షన్ చేయడంలో చిన్నగంజాం, భట్టిప్రోలు, అమతలూరు మండలాలకు చెందిన అధికారుల నిర్లక్ష్యంగా ఉన్నాం న్నారు. గృహ నిర్మాణ పని తీరుపై నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు గృహ నిర్మాణాలు బేస్మెంట్ లోపు ఉన్నవాటిని వచ్చే నెల లోపు స్టేజి కన్వర్షన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల క్లెయిమ్స్‌పై వెంటనే విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్చూరు, మార్టూరు, యద్దనపూడి మండలాల్లో క్లెయిమ్స్ పెండింగ్ ఎక్కువగా ఉన్నాయన్నారు. యుద్ధప్రాతిపదికన క్లెయిమ్స్ విచారణ పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సిహెచ్.శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకట రమణ, గహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, పంచాయతీ రాజ్ ఎస్ఇ హరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మోపిదేవి వెంకటరమణారావు

సాధికార యాత్రకు ఆదరణ : మోపిదేవి

ప్రజాశక్తి- చెరుకుపల్లి

ప్రజలకు మంచి చేశాం కాబట్టే మళ్లీ ధైర్యంగా వారిని ఓట్లను అడుగుతున్నామని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మోపిదేవి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక సాధికార యాత్రను ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రజలను ఆర్థికంగా , సామాజికంగా సమతూకం పాటించి అభివద్ధి చేసిన మొదటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. చంద్రబాబు నాయుడు రాజకీయ విలువలకు తిలోదకాలు ఇచ్చి ఎవరికో మేలు చేయాలని తెలంగాణాలో పోటీ చేయడం లేదన్నారు. పార్టీని నమ్ముకున్న వ్యక్తులను నిలువునా మోసం చేసే నైజం చంద్రబాబు నాయుడుదని తెలిపారు. చంద్రబాబు హయాంలో ఒక్క పెన్షను పథకం తప్ప ఏ పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. పవన్‌కల్యాణ్ తెలంగాణలో బిజెపితో, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపితో పొత్తు అంటూ రాజకీయ విలువలకు తిలోదకాలు ఇస్తున్నాడనివి మర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు పైనం ఏడుకొండల రెడ్డి, మాజీ ఎంపీపీ చిన్న కోటేశ్వరరావు, కామినేని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న ఎంఎం.కొండయ్య

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : ఎంఎం.కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

ఒక్క అవకాశమంటూ అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ రాష్ట్ర ప్రజల సమస్యలపై ప్రశ్నించిన వారి పై అక్రమ కేసులు పెట్టి భయపెడుతున్నారని, టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి మంచి రోజులు టిడిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంఎం. కొండయ్య తెలిపారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం 20వ వార్డు పరిధిలోని లక్ష్మి థియేటర్ రోడ్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య ఇంటింటికీ తిరిగి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే మ్యానిఫెస్టోలోని అంశాల గురించి ప్రజలకు వివరించారు. జగన్మోహన్ రెడ్డికి ఒక్క ఛాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలాగా తయారు చేశారని విమర్శించారు. మరోసారి మోసపోవద్దని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గజవల్లి శ్రీనివాసరావు, గంజి పురుషోత్తం ఉసిరిపాటి సురేష్, అంగిరేకుల వెంకటేశ్వర్లు ,అమర్, తేలప్రోలు నాగేశ్వరరావు, మల్లి బాబు, సింగరేసు కాళిదాసు, గోలి శ్రీనివాసరావు, అయూబ్ పటాన్, సుధీర్, శ్రీ చరణ్, వినయ్ , మనోహర్, అప్పారావు , ధరిశా, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలపై అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక ప్రత్తిపాటి సీతారామ యోగిని కళ్యాణ మండపం నందు బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు చిన్న వయస్సులో వివాహాలు చేయవద్దని అన్నారు. వివాహం చేస్తే బాధ్యత తీరుతుందని తల్లిదండ్రులు అనాలోచితంగా నిర్ణయాలు తీసుకొని వారి జీవితాలను నాశనం చేయవద్దని అన్నారు. బాలికల రక్షణ, సంరక్షణ బాధ్యత తల్లిదండ్రులదే అన్నారు. బాల్య వివాహాల చుట్టూ ఉన్న చట్టపరమైన చిక్కులను వివరించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, 2006పోక్సో చట్టం, 2012, 2019లో చేసిన సవరణల గురించి వివరించారు. మైనర్‌లను వివాహం చేసుకోవడం, వారితో వ్యభిచారం చేయడం, పిల్లలను ఏర్పాటు చేయడం వంటి వారికి శిక్ష గురించి వివరించారు. విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. ఈ

సమావేశంలో బాలల హక్కుల కమిటి సభ్యురాలు పద్మావతి

సందర్భంగా మున్సిపల్ కమిషనర్ విజయ సారథి మాట్లాడుతూ బాలికలు తమ రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేసిన చట్టాలను తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు మల్లికార్జునరావు, ఎంపీడీఓ శివపార్వతి, ఎంఈఓ సురేష్, పట్టణ సీఐ నజీర్ బేగ్, సిడిపిఓ మాణిక్యం, ఎఎన్‌ఎంలు, మహిళా పోలీసులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ముండ్లమూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు బుధవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా బాల్యవివాహాలు అంతం చేద్దాం అనే నినాదంతో కరపత్రాలను ఎంపిడిఒ ఎన్‌విఎల్ హనుమంతరావు చేతుల మీదుగా బుదవారం ఆవిష్కరించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యా సంస్థలలో విద్యార్థిని, విద్యార్థులకు విద్యా హక్కు చట్టం ద్వారా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక విద్య ప్రతి ఒక్కరికి అందేలా, జీవించే హక్కు, రక్షణ హక్కు, వాక్ స్వాతంత్రపు హక్కు, భావ ప్రకటన హక్కు, ఆస్తి హక్కు చట్టాలను వివరించారు. డిబిఆర్‌సి ఏరియా కో-ఆర్డినేటర్ గోపన బోయిన వెంకట్రావు మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడపిల్లలు సామాజిక ప్రసార మాధ్యమాలపై దృష్టితోటి అనర్థాలే తెచ్చుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజశేఖరరెడ్డి, సురేష్‌రెడ్డి, కాలువ సువర్ణ, జీవ రత్నం పాల్గొన్నారు.

మేదరమెట్ల : 'బాల్యవివాహాలను అంతం చేద్దాం' అనే నినాదంతో కూడిన కరపత్రాన్ని సిడిపిఓ ఎ కృష్ణకుమారి స్త్రీ, శిశు సంక్షేమ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు సమాజంలోని దురాచారానికి, దారిద్రానికి ప్రతిరూపం అనినారు. చదువు ఆటపాటలతో గడపవలసిన బాల్యాన్ని కష్టాల జీవితంలోనికి నెడుతుందని అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాలని కోరారు.

మేదరమెట్లలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిడిపిఒ కృష్ణకుమారి

ముండ్లమూరులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఇడిఒ

దూర విద్యను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వం కల్పించిన దూర విద్యా విధానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దూరవిద్య రాష్ట్ర డైరెక్టర్ కె నాగేశ్వరరావు కోరారు. మండలంలోని వెల్లటూరు ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో జరుగుతున్న దూర విద్యా కేంద్రానని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాల వలన చదువును మధ్యలోనే మానేసిన అనేకమంది యువతీ, యువకులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఓపెన్ విద్యా విధానాన్ని సద్వినియోగం చేసుకొని కోర్సులు పూర్తి చేసి బహుళ ప్రయోజనాలు పొందాలని అన్నారు. ఇప్పటికే అనేకమంది వివిధ రకాల డిగ్రీలు పొంది ఉద్యోగాలలో పదోన్నతులు పొందిన సంఘటన అనేక ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జి రాజేంద్రప్రసాద్, విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయులు కెఎం జసింత పాల్గొన్నారు.

దూరవిద్య డైరెక్టర్ నాగేశ్వరరావు

జల్‌దివాళీలో మహిళలకు బహుమతులు ఇస్తున్న ఛైర్మన్

నీటి పొదుపు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

నీటిని నిల్వ చేస్తే భవిష్యత్ తరాలకు ఎటువంటి నీటి సమస్యలు ఉండవని, మానవ మనుగడకు తాగు నీరు ఎంతో దోహద పడుతుందని మున్సిపల్ కమిషనర్ విజయసారథి అన్నారు. పట్టణంలోని అరవపల్లి రోడ్డులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన జల్ దీవాళి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాగునీరు వృధా కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మహిళలకు వివరించారు. నీటి వాడకంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించామని అన్నారు. మన తరాలకు, రాబోయే తరాలకు నీటిని పొదుపు చేయాలని అన్నారు. అవసరమైన వాటిని మాత్రమే ఉపయోగించడం, దానిని సంరక్షించడం ప్రతి ఒక్కరు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్

సముద్రతీరంలో పరిశుబ్రత చేయిస్తున్న ఎంపిడిఒ శర్మ

సముద్రతీరం పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - వేటపాలెం

సముద్రతీర పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇన్చార్జి ఎంపీడీఓ ఎంవీఎస్ శర్మ అన్నారు. మండలంలోని అక్కయ్యపాలెం పంచాయతీ రామాపురం సముద్రపు ఒడ్డున చీరాల పీనీష్ సొసైటీ, ఐటీసీ బంగారు భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మెరైన్ బీచ్ క్లీన్ డ్రైవ్ ప్రోగ్రాం బుధవారం నిర్వహించారు. ముందుగా స్కూలు విద్యార్థులతో శుభ్రత, పరిశుభ్రత మీద అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేక అధికారి ఐ కాశీ విశ్వనాథం, కార్యదర్శ పర్ణం పూర్ణ కుమారి పాల్గొన్నారు.

12న మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మండలంలోని గంగవరం ఆరోగ్య, సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 12న బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు రెగ్యులర్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు వేదిక కన్వీనర్ కరి బాలచంద్రం తెలిపారు. మంచాల వెంకట రామయ్య, రంగమ్మ కళ్యాణ మండపంలో ఆదివారం శిబిరం జరుగుతుందని తెలిపారు. బిపి, షుగర్ ఉన్న వాళ్లకు పరీక్షలు చేసి రెండు నెలలకు సరిపడా మందులు కేవలం రు.200 అందజాస్తారని అన్నారు. ఉదయం 6 గంటల నుండి 11గంటల వరకు ఉచితంగా రక్త పరీక్షలు చేస్తారని అన్నారు. శిబిరానికి డాక్టర్ బోడెంపూడి ప్రకాశరావు, సీతారావమ్మ జాపకార్థం కుటుంబ సభ్యులు సహాయ సహకారాలు అందిస్తు న్నారని అన్నారు. శిబిరంలో డాక్టర్ మంచాల రమేష్ కుమార్, డాక్టర్ అన్నంరాజు సాంబయ్య హాజరవుతారని తెలిపారు.

'జగనే ఎందుకు కావాలంటే'

ప్రజాశక్తి - పంగులూరు

ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం ఈ నెల 9నుండి జరుగుతుందని ఎంపీడీఓ బి రామాంజ నేయులు తెలిపారు. ఈ నెల 9న పంగులూరు-1, 10న పంగు లూరు-2, 14న రామకూరు, 15న రేణింగివరం, 16న టికొప్పెరపాడు, 17న అలవలపాడు, 20న బూదవాడ, 21న బైటమంజులూరు, 22న చందలూరు, 23న కల్లంవారిపాలెం సచివాలయాల్లో జరుగుతుందని తెలిపారు. మిగిలినవి షెడ్యూల్ ప్రకటిస్తామని తెలిపారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆర్డీఓ హేలా షారోన్ కోరారు. తహశీల్దారు కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. కాలనీలో కనీసం మౌలిక వస్తువులైన రహదారులు, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రస్తుతం అన్ని జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినప్పటికీ రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయని అన్నారు. మెటీరియల్ కాలనీలోకి చేరే అవకాశం లేకపోవడంతో లబ్ధిదారులు ముందుకు రావటం లేదని ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర్ ఆర్డిఓకు వివరించారు. కార్యక్రమంలో తహశీల్దారు దూళిపూడి వెంకటేశ్వరరావు, పిఆర్ ఎఈ రామచంద్రరావు, హౌసింగ్ ఎఈ రావూరి సౌమ్య రేవతి పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో ఆర్‌డిఒ హేలా షారోన్

లంక భూముల పరిశీలన

కృష్ణానది పరివాహక లంక భూములను సాగు చేసుకునే దళిత, గిరిజనులకు ప్రభుత్వం అందించిన పట్టాలకు సంబంధించి భూములను రేపల్లె ఆర్డిఓ హేలా షారోన్ బుధవారం పరిశీలించారు. వెల్లటూరు చిన్న రేవు వద్ద పట్టాల పొందే రైతులను పిలిపించి మాట్లాడారు. ఈనెల 15న సిఎం చేతుల మీదగా అందించనున్న పట్టాల గురించి వివరించారు. ఆమె వెంట తహశీల్దారు డి వెంకటేశ్వరరావు, ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్ఓ వినీత, సర్పంచ్ చౌటూరి లక్ష్మి ఉన్నారు.

'బాబు షఉ్యరిటీ భవిష్యత్తు గ్యారెంటీ'

ప్రజాశక్తి - భట్టిప్రోలు (చుండూరు)

చుండూరు మండలం పెనుగుదురుపాడు గ్రామంలో బుధవారం టిడిపి నాయకులు బాబు షఉరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ నినాదంతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోను వివరించారు. భవిష్యత్తు గ్యారెంటీ పత్రాలను యువకులతో రిజిస్ట్రేషన్ చేయించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని కోరారు. ఓటర్ లిస్టుల వెరిఫికేషన్, విలేజ్ మ్యాపింగ్ వంటి కార్యక్రమాలు క్లస్టర్, బత్, యూనిట్ ఏజెంట్లు జాగ్రత్త వహించి పూర్తి చేయాలని అన్నారు. టిడిపి మేనిపెస్టోలోని విషయాలు ప్రతి కుటుంబానికి చేరేవిధంగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రుద్రపాటి ఉషారాణి జీవరత్నం పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టో కరపత్రాలు అందిస్తున్న నక్క ఆనందబాబు

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - సంతమాగులూరు

ఈనెల 9నుండి 23వరకు మండలంలోని 10గ్రామ సచివాలయాల్లో షెడ్యూల్ ప్రకారం సంక్షేమ పథకాలపై, ప్రజా ప్రతినిధులకు ఆయా పంచాయతీ గ్రామ కార్యదర్శులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని ఇన్ చార్జి ఎంపీడీఓ ఎన్ శివరామప్రసాద్ తెలిపారు. కార్యక్రమాలకు ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచులు, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని అన్నారు. అలాగే ఆయా గ్రామాలలో దండోరా ద్వారా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈనెల 9న సంతమాగులూరు-1, 10న సంతమాగులూరు-2, 14న ఏల్చూరు-3, 15న ఏల్చూరు-1, 16న ఏల్చూరు-2, 17న గురిజేపల్లి, 20న కామేపల్లి, 21న కొమ్మాలపాడు, 22న కొప్పరం, 23న మక్కెనవారిపాలెం గ్రామాలలో సంక్షేమ పథకాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

విలేకర్లతో మాట్లాడుతున్న డిఇఒ రామారావు

విద్యార్థుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యాలు పరిపూర్ణంగా పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని డిఇఒ పివిజె రామారావు అన్నారు. గుళ్లపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో జరుగుతున్న సమీక్ష సమావేశాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెల 8న అన్ని స్కూల్ కాంప్లెక్స్ ల పరిధిలోని హెచ్‌ఎంలకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించి సదుపాయాలపై సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకోను న్నట్లు తెలిపారు. జిల్లాలోని మార్టూరు పరిధిలో 7మండలాలకు, బాపట్లలో 5మండలాలకు, చీరాలలో 6మండలాలకు, చెరుకుపల్లిలో 7మండలాలకు స్కూల్ కాంప్లెక్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ టి నవీన్ కుమార్, హరిబాబు, పులి లాజర్ పాల్గొన్నారు.

తేల్చుకుందాం..

- బాలినేని, దామచర్ల మధ్య మాటల యుద్ధం
- తాజాగా బకింగ్‌హాం బ్రిడ్జి రోడ్డు కోతపై వాగ్వాదం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మధ్య మళ్లీ మాటల యుద్ధం మొదలైంది. ఇద్దరూ అప్పుడప్పుడూ ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసుకోవడం తెలిసిందే. తాజాగా బకింగ్‌హాం కాలువపై బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు వర్షాలకు కోతకు గురైన అంశంపై ఇద్దరి మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. సవాళ్లు విసురుకున్నారు. మంగళవారం నాడు కొత్తపట్నం రోడ్డులో బకింగ్‌కాలువపై బ్రిడ్జి అప్రోచ్‌రోడ్డు వర్షాలకు కోతకు గురైంది. ఈ ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బాలినేనిపై ఆరోపణలు చేశారు. ఈ బ్రిడ్జి తమ హయాంలో 80 శాతం పూర్తి చేశామని, మిగిలిన 20 శాతం పనులు పూర్తిచేయడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని బాలినేనిపై ఆరోపణలు చేశారు. చేతనైతే 22వతేదీ లోపు పూర్తిచేయాలని, లేకుంటే తాము అధికారంలోకి వచ్చాక పూర్తిచేస్తామని హెచ్చరించారు. దేవినేని ఉమా మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ మద్యం, ఇసుక వంటి వాటిల్లో కోట్లాదిరూపాయలు దోచుకుంటున్నారని, దాన్నంతా అధికారంలోకి రాగానే కక్కిస్తామన్నారు. దీనిపై మాజీ మంత్రి బాలినేని బుధవారం నాడు స్పందించారు. జనార్ధన్‌పై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. నీకు సిగ్గుందా? కాంటాక్టర్ వద్ద కమీషన్లు నేను తీసుకున్నానా? అతను ఎవరో కూడా తనకు తెలియదన్నారు. కాంట్రాక్టర్‌ను పెట్టింది మీరేనని, కేంద్రం నుంచి బిల్లులు రాకపోతే తానేమి చేయగలనన్నారు. కేంద్రం ఈ బిల్లులను సీజ్ చేసిందన్నారు. కాంట్రాక్టర్‌ను పిలిచి మాట్లాడితే బిల్లులు రాలేదని చెప్పగా మెటీరియల్ కోసం తాను రూ.40 లక్షలు ఏర్పాటు చేశానన్నారు. అతని వద్ద కమీషన్లు తీసుకున్నది నీవేనని దామచర్లపై ఆరోపణలు చేశారు. తాను ఏ గుడికి రమ్మన్నా వచ్చి ప్రమాణం చేస్తానని, 'దేవుడి మీద నీకు నమ్మకం ఉంటే రా..' అంటూ దామచర్లకు సవాల్ విసిరారు. 'ఇలాంటి మాటలు మాట్లాడటానికి సిగ్గుందా? నీవు మనిషివేనా?' అంటూ తీవ్రస్థాయిలోనే జనార్ధన్‌పై ఆరోపణలు చేయడం చర్చగా మారాయి. అనంతరం దామచర్ల కూడా మీడియాతో మాట్లాడుతూ సవాల్‌కు తాను సిద్ధమేనని.. రేపే సాయిబాబా గుడి వద్దకు రావాలని బాలినేనికి ప్రతిసవాల్ విసిరారు. ఇద్దరి మధ్య రాజకీయంగా వాతావారణం వేడెక్కింది. ఇద్దరూ నగరంలో పర్యటిస్తున్నారు. ఏదో సందర్భంలో మీడియాలో ఇద్దరూ తీవ్ర స్వరంతోనే మాట్లాడుకుంటున్నారు. అయితే జనం సమస్యలపై చర్చ స్వల్పంగా ఉంటోంది. మధ్యలో దారి తప్పుతోంది. ఇద్దరి మధ్య వ్యక్తిగత దూషణలు, ఆరోపణలు, వాడివేడి మాటలే ఎజెండాగా మారాయి.

రాష్ట్రంలో కుస్తీ..కేంద్రంతో దోస్తీ..

- రాష్ట్ర ప్రయోజనాలు బిజెపికి తాకట్టు పెట్టడంలో వైసిపి, టిడిపి, జనసేన ఒక్కటే
- ప్రజారక్షణ భేరి బహిరంగ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్రంలో అధికారం కోసం పందెంకోళ్లలా పోట్లాడుకుంటున్న వైసిపి, టిడిపిలు కేంద్రంలో బిజెపిని ప్రసన్నం చేసుకోవడంలో, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టుపెట్టడంలో మోడీ కాళ్లు పట్టుకోవడానికి పోటీ పడుతున్నాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ విమర్శించారు. స్థానిక గడియార స్థంభం సెంటర్లో బుధవారం జరిగిన సిపిఎం ప్రజారక్షణ భేరి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు రాష్ట్రానికి ప్రత్యేక హెూదా తెస్తానని ఊరూరూ తిరిగి చెప్పిన జగన్ అధికారానికి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. విశాఖ ఉక్కు ప్రవేటీకరణపై ఆచరణలో నోరెత్తడం లేదన్నారు. రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్యాకేజీ, కడప స్టీల్, పోలవరం నిధులు, రాజధానికి నిధులు.. ఏవీ అడగడం లేదని అన్నారు. సైకో పోవాలి, సైకిల్ రావాలని చెబుతున్న టిడిపి కూడా కేంద్రంలో బిజెపి ప్రవేశపెట్టే అన్ని బిల్లులనూ ఆమోదిండంలో పోటీ పడుతుందని అన్నారు. ఐదేళ్ల క్రితం చంద్రబాబు ప్యాకేజీకి ఒప్పుకుంటే పాచిపోయిన లడ్డుతో పోల్చిన జనసేన నేత పవన్‌కళ్యాణ్‌కు ఇప్పుడు రుచికరమైన లడ్డు ఏవిధంగా అయ్యిందో చెప్పాలని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ రూ.20 వేల కోట్లు మహిళలకు వ్యక్తిగత సహాయం పేరుతో ఖాతాల్లో జమచేస్తూ రూ.35 వేల కోట్లు మద్యంపై ప్రభుత్వం అధికారికంగా వసూళ్లు చేస్తుందన్నారు. మద్యం టార్గెట్ ఈ ఏడాది ఇంకా పెంచుకున్నారని అన్నారు.

అనంతరం తమ పంట పొలాలలో అక్రమ ఇసుక తవ్వకాలు నిలుపుదల చేయాలని, కావూరివారిపాలెం రైతులు, పట్టణంలోని రోశయ్య కాలనీలో ఇండ్లు శిథిలావస్థకు చేరడంతో పున:నిర్మించాలని, పేరాల హైస్కూల్ గ్రౌండ్ లో క్రీడా మైదానంలో కట్టడాలను నిలుపుదల చేయాలని, పలు అంశాల పైన సిపిఎం నేతలకు ఆయా ప్రాంత వాసులు అర్జీలను అందజేశారు. కార్యక్రమానికి సిపిఎం చీరాల పట్టణ కార్యదర్శి ఎన్ బాబురావు అధ్యక్షత వహించారు. సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు ప్రభాకరరెడ్డి, కె.ఉమామహేశ్వరరావు, భాస్కరయ్య, దయా రమాదేవి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, మంజుందర్, నాయకులు ఎం.వసంతరావు, పి.కొండయ్య, జి.ప్రతాప్‌కుమార్, ఎల్.జయరాజు, నారపరెడ్డి పాల్గొన్నారు.

ప్రజానాట్యమండలి కళాకారుల ప్రదర్శన

చీరాల బహిరంగ సభలో మాట్లాడుతున్న గఫూర్

సిపిఎం బస్సు యాత్రు ఘన స్వాగతం

ప్రజా రక్షణ బేరి బస్సు యాత్రకు చీరాలలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. జయంతిపేట గేట్ సెంటర్‌లోని పూలే, అంబేద్కర్, జాషువా, బుద్ధుని విగ్రహాలకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి పూలమాలలతో ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం గేటు సెంటర్ నుండి బైక్ ర్యాలీతో గడియార స్థంభం సెంటర్‌కు చేరుకున్నారు. గడియార స్థంభం సెంటర్లో బహిరంగ సభ వద్ద తప్పెట్లతో సందడి చేశారు. సిపిఎం నేతలపై మహిళలు పూలు చల్లి స్వాగతం పలికారు. ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన పాటలు, నత్య రూపకాలు ప్రజలను ఆలోచింపజేశాయి.

అదానీ, అంబానీలకు కొమ్ముకాస్తున్న కేంద్రం

పర్చూరు: అదానీ, అంబానీలకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్చూరులో సిపిఎం ప్రజా రక్షణ సమరభేరి బస్సు యాత్ర సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మోడీ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇస్తానని మోసం చేశాడని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఇప్పటి వరకు చేయలేదని కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వంతెన వద్ద నుండి బొమ్మల సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నరిశెట్టి ఆచార్యులు, బండి శంకరయ్య, కందిమల్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు, జి గోవిందరెడ్డి, కె శ్రీనివాసరావు, ఎం డేవిడ్, బి చినదాసు, నాగండ్ల వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను విస్మరించిన ప్రభుత్వాలు

భట్టిప్రోలు: ప్రజాసమస్యలను గాలికి వదిలేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలైన బిజెపి వైసిపిలను ఇంటికి సాగనంపాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్ పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా రక్షణభేరి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన బస్సుయాత్ర బుధవారం భట్టిప్రోలుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక రథం సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సిపిఎం మండల కమిటీ సభ్యులు జి సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మే పని చేపట్టిందన్నారు. కార్యక్రమానికి ముందుగా ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన కళాకారులు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందులు, గ్రామాల్లో మురుగునీటి పారుదల లేకపోవటం, అధ్వానంగా ఉన్న రహదారులు వంటి పలు రకాల సమస్యలపై స్థానికులు వినతిపత్రం అందజేశారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా సిపిఎం చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని భట్టిప్రోలు, అద్దేపల్లి ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ సలీం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు టి కష్ణమోహన్, మండల కమిటీ నాయకులు ఎం సత్యనారాయణ, జి నాగరాజు, బి నాగమల్లేశ్వరరావు, దీపాల సత్యనారాయణ, బోరుగడ్డ సుబ్బారావు, రాంబాబు పాల్గొన్నారు.

– ప్రజారక్షణభేరి బస్సుయాత్రలో వచ్చిన నేతలు బుధవారం రాత్రి భట్టిప్రోలులోనే బస చేశారు. గురువారం ఉదయం బస్సు యాత్ర గుంటూరు జిల్లాకు వెళ్లనుంది.

భట్టిప్రోలులోని సిపిఎం నేతలకు అర్జీ ఇస్తున్న ముస్లిం నాయకులు